మర్నాడు పినవీరభద్రుడు అన్నద్వారా రాత్రి జరిగినసంగతంతా విన్నాడు. అన్నదమ్ములు చాలా పశ్చాత్తాపపడ్డారు. ఇంక ఏమనుకున్నా ఏంలాభం! పినవీరభద్రకవి అసంపూర్తిగ్రంధమునే రాజుకి అంకితముచేశాడు. అదే 'జైమినీ భారతం' అని అంటారు.

చిక్కాల భూపతిరావు.

# కర్మదేవి

రాజపుత్రస్థానంలోని పౌరంత రాజ్యాన్ని మాణిక్యరాజుకు పరిపాలిస్తూ వుండేవాడు. మాణిక్యరాజు లేక లేక కలిగిన కుమార్తె కర్మదేవి. కర్మదేవి తెలివయినది, ధైర్యపరాక్రమాలు గలది.

పూగల్ సంస్థానాధిపతియైన - రణవంగదేవుని కుమారుడు సాధుకుమారుడు. సాధుకుమారుడు గొప్ప ధైర్య పరాక్రమాలుగలవాడు. సాధుకుమారుడికి, మాణిక్యరాజుకి మధ్య మంచి స్నేహంవుంది. అంచేతనే సాధుకుమారుడు అప్పుడప్పుడు, పౌరంత రాజ్యానికి వస్తూపోతూ వుండేవాడు. ఇలా సాధుకుమారుడు వస్తూండడంమూలాన కర్మదేవి, సాధుకుమారులమధ్య ప్రేమ అభివృద్ధిగాంచింది. కాని యీ సంగతి మాణిక్యరాజుకి తెలీదు.

కర్మదేవికి యుక్తవయస్సు వచ్చింది. మాణిక్యరాజు వివాహప్రయత్నాలు ప్రారంభించాడు. దేశదేశాలనుండి ఎన్నెన్నో చిత్రపటాలు తెప్పించాడు కాని కర్మదేవి కవేవి నచ్చలేదు.

చివరికి మాణిక్యరాజే మందర సంస్థానాధిపతియైన రామచంద్రుని కుమారుడు అరణ్యకమలుడికివ్వ నిశ్చయించాడు. అరణ్యకమలుడు మంచి ధైర్యం, పరాక్రమంగలవాడు; సుగుణవంతుడు. అయినా కోపిష్ఠి.

కర్మదేవికీసంగతి తెలియగానే చాలా దుఃఖించింది. వివాహప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి.

కర్మదేవి సంగతి చెలికత్తెలు తెలుసుకొని మాణిక్యరాజుకు చెప్పారు.

మాణిక్యరాజు కర్మదేవి పెళ్ళికి ఒప్పుకోలేదని తెలియగానే చాలా గాభరాపడ్డాడు.

"అమ్మా! ముందు చెప్పివుంటే, ఆ సాధుకుమారుణ్ణే రప్పించేవాణ్ణిగా! - ఇప్పుడెలాగ? అరణ్యకమలుడికి మాట యిచ్చానే ...! ..." అంటూ బాధ పడ్డాడు.

"ఏమయినా యీ వివాహం జరగడానికి వీల్లేదు నాన్నగారూ!" అంది కర్మదేవి.

"అలా అంటే ఎలా చెప్పు! పెళ్లి సన్నాహాలన్నీ అయిపోయినా యమ్మా!"

"నాన్నగారూ! నేను ఇంతకుముందే నా హృదయంలో సాధుకుమారునికి స్థానమిచ్చాను! - నాకు రెండు నాలుకలు, రెండు హృదయాలు లేవు! - పెళ్లిసన్నాహాలు జరుగుతూంటే, వాటితోపాటు మరణం సన్నాహాలుకూడా జరుగుతున్నాయి!"

మాణిక్యరాజు ఒక్కగా నొక్క కుమార్తెగావడం మూలాన అరణ్యకమలుడి కీసంగతి వ్రాసి, సాధుకుమారుని నిశ్చయించాననికూడా వ్రాశాడు.

ఈ ఉత్తరం చూడగానే అరణ్యకమలుడికి ఎక్కడలేని కోపం వచ్చింది -! అపరదూర్వాసుడు ...! అరణ్యకమలుడు సాధుకుమారుణ్ణి చంపుతానని ప్రతిజ్ఞ చేసి, యుద్ధసన్నాహాలు చేయసాగాడు.

సాధుకుమారుడికి, కర్మదేవికి మహావైభవంగా వివాహం జరిగింది. వారిద్దరూ తమ బలగంతో తమ రాజ్యానికి పయనమయ్యారు.

త్రోవలో అరణ్యాకమలుడు వీరి నడ్డాడు. ఇరు పక్షాలకు ఘోరంగా యుద్ధం జరిగింది. కర్మదేవి కూడా భర్తతో సమానంగా యుద్ధం సాగించింది. కాని దొంగచాటుగా సాధుకుమారుని, అరణ్యాకమలుని సైన్యం చంపేసింది. సాధుకుమారుడు వీరస్వర్గం చేరుకున్నాడు.

కర్మదేవి తన ఎడమచేతిని నరికి మామగారికిమ్మని భటునకిచ్చి "మీ కుమారునితో హాయిగావుంద"ని చెప్పమంది. కుడిచేయిని నరికించుకొని తండ్రికిమ్మని "అల్లుడితో సుఖంగావున్నా" నని చెప్పమని దానిని భటునకిచ్చింది.

తర్వాత కర్మదేవి భర్తతోపాటు మరణించింది. నేటికీ కర్మదేవిగాథ చరిత్రలో సువర్ణాక్షరాల్తో చెక్కబడివుంది.

పిల్లా సుబ్బారావుశాస్త్రి


వేలాది ప్రజల ప్రశంసలకు పాత్రమైనది!

# 'నా చిన్ననాటి ముచ్చట్లు'

(డాక్టరు కే. యన్. కేసరిగారి రచన)

అందమైన అచ్చు - చక్కని తయారీ - అనేక చిత్రములతో రు 3-0-0

(పోస్టేజి రు 1-0-0 ప్రత్యేకం)

వ్యాపారులకు ప్రత్యేక కమీషను వసతులు!

## గృహలక్ష్మి కార్యాలయం

మద్రాసు 14.